




అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



హైదర్‌గూడలో బోనాల ఉత్సవాల్లో గంగిడి పుల్లారెడ్డి



బోనమెత్తిన మహిళ



వైభవంగా బోనాలు



బోనాలు సమర్పిస్తున్న భక్తులు



మణికొండ పోచమ్మ అమ్మవారు



బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల్లో భాగంగా ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు భక్తులు బోనాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, కోకాపేట, గండిపేట తదితర గ్రామాలలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పూజలు నిర్వహించుకుని బోనాలను సిద్ధం చేసుకున్నారు. అనంతరం బోనాలతో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. ఆయా గ్రామాలలో తొట్టెలను ఊరేగింపుగా తీసుకుని అమ్మవారి ఆలయాలకు చేర్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు, మున్సిపాలిటీలు ఏర్పాట్లు చేశారు. నార్సింగి, రాయదుర్గం పోలీసులకు భద్రత కల్పించారు.

అత్తాపూర్: తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. అత్తాపూర్ హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించారు. ఆషాఢమాసంలో జరిగే బోనాల పండుగకు ఇంటి ఆడపడుచులను, అల్లుళ్లను, మనుమడు, మనువరాలను ఆహ్వానించడం సాంప్రదాయంగా వస్తుంది. కోళ్లు, మేకలు అమ్మవారికి ఇచ్చి తమ మొక్కులను చెల్లించుకుని అమ్మవార్లకు బోనం ఎక్కిస్తారు. అనంతరం పిండి వంటలతో పాయసాలు, పరమాన్నాలతో సహపంక్తి భోజనాలు చేస్తారు.

మైలార్‌దేవ్‌పల్లి: అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్ కోరారు. ఆదివారం బోనాల ఉత్సవాలకు పలుదేవాలయాలను సందర్శించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను నియోజకవర్గం ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కాటేదాన్, మార్కండేయనగర్, మధుబన్ కాలనీలలోని దేవాలయాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. భక్తులు అమ్మవారికి బోనాలను భక్తి శ్రద్ధలతో సమర్పించుకున్నారు. ఆలయాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఆలయ కమిటీలు తగిన ఏర్పాట్లు చేశారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున దేవాలయాల వద్దకు చేరుకోని అమ్మవారికి బోనాలను సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

శంషాబాద్: సాతంరాయి, ఊట్‌పల్లి, తొండుపల్లి, కొత్వాల్‌గూడలో బోనాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయాల్లో బోనాలు సమర్పించారు. ఘటాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలతో బోనాలు అట్టహాసంగా జరిగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పుప్పాలగూడ పోచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



రాజేంద్రనగర్‌లోని పోచమ్మబస్తీలో బోనాల సంబరాలు



పూజల్లో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి



శివాజీనగర్ బోనాల ఉత్సవాల్లో మణికొండ నాయకులు



బోనాల పూజల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



భాగ్యలక్ష్మికాలనీ దుర్గామాత ఆలయంలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు



మణికొండ పోచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకున్న భక్తులు



బోనాలతో మహిళలు



చిత్రపురి కాలనీలో రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్‌లు



బైరాగిగూడలో బోనాలతో మహిళలు



కోకాపేటలో తొట్టెల ఊరేగింపులో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి



పుప్పాలగూడలో మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



బోనాల ఊరేగింపులో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తదితరులు



మంచిరేవులలో పోతురాజుల విన్యాసాలతో సామూహికంగా బోనాలు



బిజిలి అమ్మవారి ఆలయం వద్ద పోతరాజుల విన్యాసాలు



బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు



మణికొండ క్వార్టర్స్‌లో బోనాలతో మహిళలు



అత్తాపూర్ బోనాల ఉత్సవాల్లో కొండకళ్ల కుటుంబ సభ్యులు

అదుపు తప్పిన కారు



అదుపు తప్పి పల్టీ కొట్టిన కారు

మణికొండ: కారు నేర్చుకునే క్రమంలో రోడ్డుపైకి వచ్చిన ముగ్గురు మైనర్లు కారు అదుపుతప్పడంతో రోడ్డు పక్కన గుంతలో పడిపోయిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లికి చెందిన ముగ్గురు మైనర్లు కారు నేర్చుకునేందుకు వట్టినాగులపల్లి వైపు వచ్చారు. శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాల ముందు రోడ్డు ఖాళీగా, పెద్దగా ఉండటంతో అది అదుపు తప్పింది. రోడ్డు పక్కకు వెళ్లి గోతిలో పల్టీ కొట్టింది. అందులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి సంఘటనలపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని వట్టినాగులపల్లి వాసులు కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మైలార్‌దేవ్‌పల్లి: అనుమానస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీలో నివసించే కిష్టప్ప (52) దంపతులు తమ కొడుకు మహేందర్‌తో కలిసి జీవిస్తున్నారు. శనివారం తండ్రి కొడుకులు మద్యం సేవించారు. రాత్రి నుంచి తండ్రి, కొడుకుల మధ్య కుటుంబ గొడువలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కిష్టప్ప శరీరానికి ఎలాంటి దెబ్బలు తగలకుండా మృతి చెందాడు. దీంతో ఉదయం కిష్టప్ప భార్య పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువురి మధ్య గొడవ జరిగిన విషయం నిజమేనని.. కాని కిష్టప్ప ఎలా చనిపోయాడనే కోనంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పాతబస్తీలో అమ్మవారి ఘటాల ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీలో సోమవారం జరిగే అమ్మవారి ఘటాల ఊరేగింపునకు ఉత్సవాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సామూహిక ఊరేగింపు సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని భాగ్యనగర్ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

సాయంత్రం 6 గంటలకు చార్మినార్ దాటేటట్లు..

అమ్మవారి ఘటాల ప్రారంభ ఊరేగింపు సోమవారం సాయంత్రం 6 గంటలకు చార్మినార్ దాటేటట్లు దక్షిణ మండలం పోలీసులు కార్యాచరణను రూపొందించారు. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉత్సవాల నిర్వాహకులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. అక్కన్న మాదన్న ఆలయ ఘటం ఊరేగింపు 3.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.15 గంటలకు హిమ్మత్‌పురా చౌరస్తాకు..6 గంటలకు చార్మినార్ కట్టడం చేరుకునే విధంగా తమతో సహకరించాలని పోలీసులు నిర్వాహకులకు సూచించారు. అలాగే మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ ఘటం ఊరేగింపు సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 6 గంటలకు చార్మినార్ చేరుకోవాలని పోలీసు అధికారులు కోరారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు..

సోమవారం నిర్వహించనున్న అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. దక్షిణ మండలంలోని చార్మినార్, మీర్‌చౌక్, ఛత్రినాక, ఫలక్‌నుమా తదితర ఏసీపీల పరిధిలో సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ట్రాఫిక్ ఆంక్షాలు అమలులో ఉంటాయని నగర అదనపు ట్రాఫిక్ పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్ తెలిపారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీవనం 7వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి శాంతికృష్ణ సంపాదకత్వం వహించిన కడలి పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, అంపశయ నవీన్ మాట్లాడుతూ..వివిధ అంశాలపై పలువురు రచయితలు రాసిన పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం యండమూరి వీరేందర్‌నాథ్ రచించిన కొండమీది నక్షత్రాలు, వర్ధమాన రచయితలు రాసిన ఏడు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, యండమూరి వీరేంద్రనాథ్, రచయితలు నాళేశ్వరం శంకర్, మానశ్రీ మల్లిక్, గడ్డం శ్యామల, విహారి, సంస్థ అధ్యక్షురాలు శాంతికృష్ణ పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో 'ఎస్‌డీజీ'పై అవగాహన

గోల్కొండ: పాఠశాల విద్యార్థులకు సాధికారిత కల్పించడంతో పాటు సాధికారిత భవిష్యత్ నాయకులకు అవకాశం కల్పించడం గొప్ప విషయమని డాక్టర్ గౌతమి అన్నారు. ఆదివారం జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌డీజీ(క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్), క్లైమైట్ యాక్షన్ తదితర వాటిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో పాల్గొన్న మిస్ గ్లోబ్ ఇండియా ఐశ్వర్య పాతపాటి

గచ్చిబౌలి: నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని మిస్ గ్లోబ్ ఇండియా–2023, రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ ఐశ్వర్య పాతపాటి అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో వరల్డ్ హెపటైటీస్ డేను పుర స్కరించుకుని హెపటైటీస్, ఫిట్‌నెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో చిన్న మార్పులు చేసినా మంచి మార్పును చూడవచ్చన్నారు. కేర్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సునీత అగర్వాల్ మాట్లాడుతూ హెపటైటీస్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది మంది మరణిస్తున్నారన్నారు. కాలేయ ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి కేర్ హాస్పిటల్ స్క్రీనింగ్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఆశా సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఐదు రకాల వైరస్‌ల వల్ల హెపటైటీస్ సోకుతుందన్నారు. వ్యాక్సిన్‌ల ద్వారా హెపటైటీస్ బీ,డీ నయమవుతుందని, హెపటైటీస్ సీ మందుల ద్వారా నయమవుతుందన్నారు. కలుషిత నీరు, ఆహారం ద్వారాహెపటైటీస్ సోకే అవకాశం ఉందన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 25న కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి(70) అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు అతడిని కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జర్నలిస్టు ప్రీమియర్ లీగ్

గన్‌ఫౌండ్రీ: గత వారం రోజులుగా జరుగుతున్న కేఎస్‌జీ జర్నలిస్టు 2020 ప్రీమియర్ లీగ్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీల్లో ఎన్‌టీవీపై టీవీ 9, 12 పరుగుల తేడాతో విజయం సాధించి సీజన్–1 విజేతగా నిలిచింది. ఈ సందర్బంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ..నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే క్రీడా జర్నలిస్టులు ప్రొఫెషనల్ తరహాలో క్రికెట్ ఆడడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ తరహా పోటీలు తరచుగా నిర్వహించాలని సూచించారు. అనంతరం స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ తరఫున పది మంది దివ్యాంగ క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. అదేవిధంగా పోటీలో గెలుపొందిన జట్లకు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు బల్జిత్‌సింగ్, సహాయ కార్యదర్శి బసవరాజు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, తృక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి, కేఎస్‌జీ సీఈఓ సంజయ్, భరణి, శరత్, ఉర్సురమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్వర్డ్‌జెన్నర్ సేవలు ఎనలేనివి



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రమేష్‌కంచర్ల, డాక్టర్ విక్రమ్ వెంకటేశ్వరన్, డాక్టర్ ప్రణతిరెడ్డి తదితరులు

రాయదుర్గం: ప్రపంచంలో దాదాపు నిర్మూలించిన ఏకైక వ్యాధి మశూచి అని రెయిన్ చిల్డ్రన్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల అన్నారు. ఆదివారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షరటాన్ హోటల్‌లో రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అడల్ట్ వ్యాక్సినేషన్ ఔట్‌రీచ్ నెట్‌వర్క్(ఏవీఓఎన్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మశూచి వ్యాక్సిన్ ద్వారా ప్రపంచంలో లక్షలాది మంది ప్రాణాలను కాపాడేందుకు కారణమైన డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ సేవలను వైద్యరంగం ఎప్పటికీ మరువదన్నారు. ఒక సమగ్ర ప్రాజెక్ట్, నిబద్ధత, అంకితభావం ద్వారా రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి దేశంలో వ్యాధి భారాన్ని తగ్గించగలదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వయస్సుతో పాటు రోగనిరోధక శక్తి తగ్గుతుందన్నారు. అందువల్ల పెద్ద వయస్సు వ్యక్తులు ఏటా టీకాలు వేయించుకోవాలని సూచించారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో సామూహిక టీకా కార్యక్రమాల ద్వారా రెయిన్‌బో ఆస్పత్రి తమ సామర్థ్యాన్ని, నిబద్ధతను చాటుకుందన్నారు. అనేక మంది శ్రేయోభిలాషులు, ఫార్మా కంపెనీలు, కార్పొరేట్లు, పెద్ద ఎత్తున వయోజన వ్యాక్సినేషన్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని కోరుతున్నామన్నారు. ఫైజర్, సనోఫీ, సీరమ్ ఇనిస్టిట్యూట్‌లతో కలిసి ప్రజలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం కోసం ఏవీఓఎన్‌ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఇంటెన్సివిస్ట్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒక అధ్యయనం ప్రకారం భారతీయ వయోజనుల్లో 2/3 వంతు మందికి అడల్ట్ వ్యాక్సినేషన్ గురించి తెలియదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ వెంకటేశ్వరన్, డాక్టర్ విజయ్, రతన్‌జలాన్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ సంతోష్ తార్, పూజా దారువాలే, డాక్టర్ ప్రమోద్ పూజారి తదితరులు పాల్గొన్నారు.